క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలలో తహసీల్దార్ తనిఖీ



తెనాలి రూరల్: పట్టణంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. పట్టణంలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుండగా తహసీల్దార్ పరిశీలించి, చీఫ్ సూపరింటిండెంట్ల ద్వారా వివరాలను తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, టూ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని పరీక్ష కేంద్రాలలో తనిఖీ చేశారు. తహసీల్దార్ వెంట టూ టౌన్ సీఐ రాముల నాయక్ ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



తెనాలి రూరల్: వ్యాపారులు తమ భవన సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ బి.జనార్దనరావు సూచించారు. పట్టణ గాంధీచౌక్‌లో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు. వ్యాపారులతో మాట్లాడారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు. అందరూ కలిసి కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే మేలు జరుగుతుందన్నారు. డీఎస్పీ వెంట వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఉన్నారు.

పేదలకు సామగ్రి పంపిణీ



తెనాలి అర్బన్: నిరుపేద గిరిజనులకు సామగ్రి పంపిణీ చేశారు. ఫర్ ది లీస్ట్ ఆఫ్ దెమ్ ట్రైబల్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు కాల్వ గట్లులపై నివశించే గిరిజనులకు బుధవారం బియ్యం, నూతన వస్త్రాలను సినీ దర్శకుడు దిలీప్‌రాజా పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ రావూరి అంజలి, రావూరి సురేష్ బాబు, మణివరన్, నరేష్ పాల్గొన్నారు.

కాలువ కట్టడాలు!

- అడ్డగోలుగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం
- నిజాంపట్నంలో నిబంధనలు పాటించని యంత్రాంగం

జలరవాణాలో వైభవంగా వెలిగిన నిజాంపట్నం కాలువ కట్ట ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు అడ్డాగా మారింది. పంట కాలువల ఆధునికీకరణ పథకంలో భాగంగా నీటిపారుదల శాఖ పలు భవనాలను నిర్మించుకొంది. మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన భవనాలు కూడా యథేచ్ఛగా వెలిశాయి. కనీస నిబంధనలు పాటించకుండా వీటిని నిర్మించడం గమనార్హం.

తెనాలి రూరల్: పట్టణంలో ప్రవహించే మూడు పంట కాలువల్లో మధ్యలో నిజాంపట్నం కాలువ ఉంది. ఒకప్పుడు ఇక్కడ జలరవాణా సాగింది. విజయవాడ నుంచి పడవల్లో సరకులను సముద్రతీరానికి చేర్చడానికి ఈ కాలువ ఎంతగానో ఉపయోగపడింది. కాలక్రమంలో జలరవాణా లేకపోయినా, భవిష్యత్‌లో పునరుద్ధరణ జరగొచ్చన్న భావనతో కాలువ కట్టను భద్రంగా కాపాడేవారు. కలప, సిమెంటు ఒరల నిర్మాణ దుకాణాలు లీజు ఒప్పందంపై ఇక్కడ ఏర్పడ్డాయి. ఊరి పొలిమేరల నుంచి వైకుంఠపురం బ్రిడ్జి సమీపం వరకు గల ఈ కాలువ కట్టపై 85 వరకు ఈ తరహా దుకాణాలు ఉన్నాయి. వీటిని తొలగించాలనే ఉద్దేశంతో నీటి పారుదల శాఖ లీజు గడువును గతంలో రెన్యువల్ చేయలేదు. ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చింది. దీనిపై వ్యాపారులు కోర్టును ఆశ్రయించారు. అక్కడి నేల నిర్మాణాలకు అనువైనది కాదని కూడా అధికారులు కోర్టుకు వివరాలు సమర్పించారు.

ఆధునికీకరణకు ప్రతిపాదన

డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెనాలి నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించినప్పుడు కాలువ కట్టను హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో ఆధునికీకరించి, తెనాలికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చిన ప్రముఖుల విగ్రహాలతో అలంకరిద్దామని ప్రతిపాదించారు. ఆ ప్రభుత్వం ఓటమితో సాధ్యపడలేదు. తర్వాత ఇదే కట్టపై నీటిపారుదల శాఖ కార్యాలయానికి ఉత్తరం వైపున ఒక సామాజిక వర్గానికి కళ్యాణమండపం, వృద్ధాశ్రమం కోసం స్థలం కేటాయించారు. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లి, ఆ ఉత్తర్వులు రద్దు చేయించారు.

వరుసగా కట్టడాలు

అనంతరం అక్కడ విద్యుత్ సబ్‌స్టేషను నిర్మించారు. కాలువల ఆధునికీకరణలో భాగంగా నీటిపారుదల శాఖ పలు కార్యాలయాలు, నివాస అపార్టుమెంట్లను నిర్మించుకుంది. నీటిపారుదల డీఈఈ కార్యాలయం, సెక్షన్ ఆఫీసు (290 చ.మీ.), క్వాలిటీ కంట్రోలు ఆఫీసు (200 చ.మీ.), సిబ్బంది క్వార్టర్లు (రెండు బ్లాకులు, 324 చ.మీ., 372 చ.మీ.), స్టోర్ షెడ్డు (100 చ.మీ.) వరుసగా నిర్మాణాలు చేశారు. వీటికి దగ్గర్లో ఐసీడీఎస్ భవనం, డీఎస్పీ కార్యాలయాల నిర్మాణమూ జరిగింది. డీఎస్పీ కార్యాలయానికి గతంలో పాండురంగపేటలో స్థలం ఉంది. అది ఆక్రమణకు గురవడంతో నాజరుపేటలో మున్సిపల్ స్థలంలో నిర్మాణానికి బేస్‌మెంట్ కూడా నిర్మించారు. బుర్రిపాలెం రోడ్డులో మరోచోట శంకుస్థాపన చేశారు. మళ్లీ హఠాత్తుగా కాలువకట్టపై నిర్మించారు. డీఎస్పీ కార్యాలయమే కాకుండ ఎం. స్నేహిత డీఎస్పీగా ఉన్న సమయంలో పోలీస్ డార్మిటరీని సైతం నిర్మించారు. కాలువ కట్టలో అక్కడి మట్టి భవన నిర్మాణాలకు అనుకూలం కాదని హైకోర్టుకు సమర్పించిన నివేదికను విస్మరించి, ఇన్ని నిర్మాణాలను చేపట్టడం గమనార్హం. ఇతర ప్రభుత్వ విభాగాలకు అనుమతించటాన్ని నీటి పారుదల శాఖ ఎలా సమర్థించుకుంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



కాలువ కట్టలో డీఎస్పీ కార్యాలయం



ఇదే కట్టపై నిర్మించిన ఐసీడీఎస్ భవనం

క్షయ నిర్మూలనే ధ్యేయం



తెనాలి అర్బన్: క్షయ నిర్మూలనకు అందరూ సహకరించాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. మంగళగిరి సమీపంలోని ఏపీహెచ్‌ఆర్‌డీఐ భవనంలో సాఫ్ట్ స్కిల్ లెవల్-1పై ఇటీవల శిక్షణ పొందిన వారికి బుధవారం తెనాలి టీబీ యూనిట్‌లో సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మీబేబి, హెల్త్ విజిటర్స్ వి.దిలీప్ కుమార్, కె.భార్గవి, ల్యాబ్ టెక్నీషియన్ పావని, టాటా ఇనిస్ట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సంస్థ ప్రతినిధి ఫిలిప్ సెబాస్టీన్ పాల్గొన్నారు.

విద్యార్థినుల క్యాండిల్ ర్యాలీ

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని టిప్పర్ల బజార్‌లో వున్న కాండ్రు కమల మున్సిపల్ పాఠశాలలో బుధవారం బేటీ బచావో... బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నియంత్రణ, ఆడ పిల్లలను చదివించడం, తల్లిబిడ్డల సంరక్షణ, ఆడ పిల్లల రక్షణ, లింగ పక్షపాతానికి వ్యతిరేకంగా లాంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం క్యాండిల్ ర్యాలీని విద్యార్థులతో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, పాఠశాల హెచ్‌ఎం షేక్ దరియావలి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మంచి మార్కుల కోసం ప్రయత్నించండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి అర్బన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు తెచ్చుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో బుధవారం పట్టణంలోని పలు మున్సిపల్ హైస్కూళ్లను మున్సిపల్ కౌన్సిలర్‌లు, అధికారులు సందర్శించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అధిక మార్కులు తెచ్చుకుని తెనాలికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అల్పాహారం పంపిణీ చేశారు. వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్‌లు అన్నం పిన్నారావు, గొడవర్తి శ్రీసాయిహరేరామ్, దేసు యుగంధర్, గోగిరెడ్డి మాసపారెడ్డి, ఎంఈవో-2 వి.జయంతిబాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారం అందేలా చర్యలు



తెనాలి టౌన్: అందరికీ పోషకాహారం అందించడమే ధ్యేయమని ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి సీడీపీవో డాక్టర్ ఎం.సునీత పేర్కొన్నారు. రూరల్ మండలం కంచర్లపాలెం గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సీడీపీవో సునీత హాజరయ్యారు. పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.యామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, శివకుమారి, స్వరూపారాణి, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఏపీఎం కె. జయశ్రీ

తెనాలి టౌన్: ఆటల పోటీలు మహిళల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఏపీఎం కె. జయశ్రీ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో పొన్నెకంటి పోతురాజు మెమోరియల్ ట్రస్ట్, జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, కోకో పోటీలు నిర్వహించారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వెలుగు ఏపీఎం కె.జయశ్రీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్స్ పొన్నెకంటి చక్రవర్తి, తుపాకులు ప్రసాద్, డ్వాక్రా యానిమేటర్స్ ఎం.సత్యవతి, నాగలక్ష్మి, బేబి, గీత, నవీన, అరుణ, కుసుమలత, భవాని తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్స్ ఆటలో మహిళలు





రహదారి భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్

మంగళగిరి టౌన్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని మంగళగిరి పట్టణ సిఐ డి.వినోద్ కుమార్ సూచించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ట్రాఫిక్ జరిమానాలు అమలులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. వాటన్నంటి గురించి సమగ్రంగా వివరించారు. ఇవేకాక ఐపీసీ, మోటర్ వెహికల్ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయనున్నామని చెప్పారు. వాహన దారులు వీటిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రాణ నష్టం జరగకుండా వాహనాలు నడపాలని సూచించారు. పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఎంపీడీవో మృతి

తెనాలి రూరల్: పట్టణానికి చెందిన విశ్రాంత ఎంపీడీవో షేక్ మొహిద్దీన్ (71) మృతి చెందారు. కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 2007లో ఇంకొల్లు మండల పరిషత్ అధికారిగా పని చేసిన సందర్భంలో అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్ బి.ఉదయలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పలు పత్రికల్లో విలేకరిగా, పారాలీగల్ వలంటీర్‌గా చేశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు కార్తీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని బుధవారం అందచేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 67 మంది విద్యార్థులకు రూ.6 వేలు విలువ చేసే పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్టేషనరీ అందజేసినట్లు అధ్యక్షుడు ఎస్.కార్తీక్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీస్తు శిలువ శ్రమానుభవ ధ్యానములు

భట్టిప్రోలు: క్రీస్తు ప్రభుని శిలువ శ్రమానుభవ ధ్యానములు గురువారం నుంచి ఏప్రిల్ 19వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి 7:30 గంటలకు జరుగుతాయని గురు మండల అధ్యక్షుడు, తూర్పు గుంటూరు సినడ్ డిప్యూటీ బిషప్ రెవరెండ్ రవీంద్ర వర్మ దాసరి బుధవారం తెలిపారు. లూథరన్ సంఘం, డెలిగేట్, పీసీసీ సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ చిల్డ్రన్ భట్టిప్రోలులో నిర్వహిస్తారని పేర్కొన్నారు. 40 శ్రమ దినములు ఆరాధనలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఏసు శిలువలో పలికిన 7 మాటలు సంఘ పెద్దలు స్త్రీల సమాజం, అంబేడ్కర్ యూత్, సండే స్కూల్, సంఘస్తుల సౌజన్యంతో ప్రత్యేకంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 8:30 గంటల వరకు ఏర్పాటు చేస్తారని వివరించారు.

రేపు వెల్లటూరులో 17వ వార్షికోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని లాక్ సెంటర్‌లో కొలువైన కనకదుర్గ మహంకాళి, నాగేంద్రస్వామి దేవాలయం 17వ వార్షికోత్సవం శుక్రవారం జరుగుతుందని నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవాని బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం దేవాలయంలో గణపతి పూజ, అభిషేకములు, కుంకుమ పూజ, సత్యన్నారాయణ వ్రతం జరగనున్నట్లు పేర్కొన్నారు. కోనేటిపురం నాగమల్లేశ్వరరావు బృందంచే భజన జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

బాలికలకు డ్రాయింగ్ పోటీలు

జంపని(వేమూరు): విద్యార్థినులు, విద్యతో పాటు పెయింటింగ్ కూడా నేర్చుకోవాలని సీఐ శ్రీమన్నారాయణ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి విద్యార్థినులకు అనేక పోటీలు నిర్వహించడం జరిగిందని, విజేతలకు మహిళ దినోత్సవరం రోజు బహుమతులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవికృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోండి



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని వ్యాపారులు అందరూ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఆర్ఆర్ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీలలో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పలు దుకాణాలకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లపై ఆరా తీశారు. తీసుకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలకు అర్హులవుతారని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రెండు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

తెనాలి రూరల్: వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఒకరు, రైల్లో నుంచి జారి పడి మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు తెనాలి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం చివరన పట్టాలు దాటుతుండగా గూడ్సు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన మహిళగా భావిస్తున్నారు. మరో ఘటనలో తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఒక్కడి యడ్ల లింగయ్య కాలనీ రైల్వే గేటు సమీపంలో జారి పడి మృతి చెందాడు. మృతదేహాలను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెండు కేసులను జీఆర్పీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

తెనాలి రూరల్: ఓ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... పట్టణ చెంచుపేట డొంకరోడ్డుకు చెందిన మందుల విజయ్ కుమార్(46) రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటాడు. గత నెల 13వ తేదీన మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా వారం అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ ఇస్లాంపేటకు చెందిన యర్రంశెట్టి కళ్యాణ్(30) వివిధ రోజువారీ పనులకు వెళుతుంటాడు. కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. వేధింపుల కేసు పెట్టింది. మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని కళ్యాణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యపానంతో అనర్థాలపై అవగాహన

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో ఎయిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో బుధవారం మద్యం వలన కలిగే నష్టాలు, అనర్థాలపై అవగాహన కల్పిస్తూ దృశ్య రూపకం ప్రదర్శించారు. మద్యం సేవించడం వలన ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాలు, కుటుంబానికి జరిగే నష్టాన్ని తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన దృశ్య రూపకం ఆకట్టుకుంది. మానసిక సమస్యలపై ఉన్న అపోహలు, మద్యం మానుకోవడం సాధ్యమే.. వంటి వాటిపై చిత్రాలు గీసిన చార్టును ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధనస్సు, సైక్రియాట్రిస్ట్ వెంకటాచలం మాట్లాడుతూ మద్యం సేవించడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, మద్యం ఎలా మాన్పించాలో వివరించే పునరావాస కేంద్రం అందుబాటులో ఉందన్నారు. మద్యం సేవించి అనారోగ్యానికి గురైన వారికి ఆ కేంద్రంలో చికిత్స నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అనూష, ఎయిమ్స్ వైద్యులు నెహమా, నర్సింగ్ ఫ్యాకల్టీ కాశేశ్వరి తదితరులు పాల్గొన్నారు.